కాలనీ సమస్యలు పరిష్కరిస్తా



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సాయి ప్రశాంత్ నగర్ ఫేజ్ 1, 2లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జీహెచ్ఎంసీ అధికారులు, కాలనీ వాసులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. కాలనీ వాసులందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. సమిష్టి కృషితో ఆదర్శవంతమైన కాలనీగా తీర్చి దిద్దవచ్చన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసేలా అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహాదేవ్, సాయి ప్రశాంత్‌నగర్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిశీల రైతులకు మొబైల్ అప్లికేషన్‌పై శిక్షణ

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రగతిశీల రైతులకు శుక్రవారం హైదరాబాద్ సెంట్రల్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్ హైదరాబాద్ నుంచి సంబంధిత వ్యవసాయశాఖ నిపుణులు ఎన్‌పీఎస్ఎస్ మొబైల్ అప్లికేషన్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణలో మొబైల్ అప్లికేషన్ ఉపయోగాలు, తెగుళ్ల నివారణ గురించి రైతులకు వివరించారు. ఈ యాప్‌ను ఉపయోగించడం ద్వారా రైతులు ఎలాంటి ఆలస్యం లేకుండా తెగుళ్లను సులభంగా గుర్తించటంతో పాటు తక్షణ నియంత్రణ చర్యలను అనుసరించవచ్చునని పేర్కొన్నారు. పురుగుమందు ఖర్చులు తగ్గిస్తుందని, పంట తెగులును సమర్థవంతంగా పర్యవేక్షించడానికి కూడా ఉపయోగపడుతుందన్నారు. ఈ యాప్ ద్వారా రైతులు తక్షణమే సలహాలను పొందవచ్చన్నారు. ఈ మొబైల్ అప్లికేషన్‌ను రైతులు ప్రత్యక్షంగా వీక్షించటం కోసం క్షేత్ర సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హైదరాబాద్ నుంచి ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు వెంకటరెడ్డి, సునీత, అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు, వ్యవసాయశాఖ నుంచి జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి చంద్రకళ, మండల వ్యవసాయశాఖ అధికారులు వెంకటరామిరెడ్డి, శిరీష, ఎంఏఓలు, ఏపీఎస్ఎస్ మొబైల్ అప్లికేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మొబైల్ అప్లికేషన్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆల్విన్‌కాలనీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. హెచ్ఎంటీ 11కేవీ ఫేజ్ 2 ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు అడ్డగుట్ట, వాటర్ ట్యాంక్ ప్రాంతం, శాతవాహన కాలనీ రోడ్డులో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మూసాపేట: జనతానగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ భీమలింగం తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కైత్లాపూర్ విలేజ్, రాఘవేంద్ర బస్తీ, కేపీహెచ్‌బీ 15వ ఫేజ్ అమ్మవారి ఆలయం, రాజీవ్ గాంధీ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

గౌతమ్‌నగర్‌లో కార్పొరేటర్ పర్యటన



బాలానగర్: ఫతేనగర్ డివిజన్ గౌతమ్ నగర్‌లో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ శుక్రవారం పర్యటించారు. పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉందని స్థానికులు కార్పొరేటర్‌కు వివరించారు. పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని కార్మికులకు ఆదేశించారు. డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల మరమ్మతులు చేయాలని జలమండలి మేనేజర్‌కు ఫోన్ చేసి సూచించారు. కార్యక్రమంలో ఉపేందర్, రామానంద్, జగన్, పాండు నాయక్, భాగయ్య, ఆనంద్‌గౌడ్, సురేందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కార్పొరేటర్ సబిహా బేగంకు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రామారావు నగర్ హిందూ శ్మశాన వాటికలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం కార్పొరేటర్ సబిహాబేగంకు వినతిపత్రం అందజేశారు. లైట్లు వెలగడం లేదని, పార్కింగ్ టైల్స్, వాచ్‌మెన్ రూమ్, ఆఫీస్ రూమ్ శిథిలావస్థకు చేరాయని వివరించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ కో ఆర్డినేటర్ వీరారెడ్డి, నాగుల సత్యం, వెంకటయ్య యాదవ్, నరసింహ, రామ్‌రెడ్డి, యోగి రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

రేపు వన భోజనాలు

బాలానగర్: బాలానగర్ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన భోజన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సంక్షేమ సంఘం అధ్యక్షులు కె. ఉపేందర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొంపెల్లిలోని శివాలయ గెస్ట్ హౌస్, సురక్ష హాస్పిటల్ పక్కన వర్మ గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. రెడ్డీలు వన భోజన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎన్ఆర్ఈసీ విద్యార్థికి గోల్డ్ మెడల్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విశ్రుత ఇటీవల నగరంలోని కాచిగూడ విక్టోరియా ప్లే గ్రౌండ్‌లో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన 69 కేజీల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థిని విశ్రుతను కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు అభినందించారు.

24న రుద్రహోమం

రాయదుర్గం: టెలికామ్ నగర్‌లోని సాయి దత్త గణపతి ఆలయంలో ఈనెల 24వ తేదీ (ఆదివారం) రుద్రహోమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు రవీందర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 6.30 గంటలకు గణపతి పూజతో ప్రారంభించి రుత్విక్‌వరుణ, దీక్షాధారణ, శైవాగమ పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసన, త్రిశూలపూజ, అస్త్రరాజార్చన, మహన్యాస మంత్రపఠనం, అమృతేశ్వరుడికి 21 ద్రవ్యములతో విశేష అభిషేకం, రుద్రహోమం, పూర్ణాహుతి, పండితాశీర్వచనం, ప్రసాద వితరణ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. మధ్యాహ్నం 1 గంటకు అన్నసమారాధన ఉంటుందని పేర్కొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

అమీర్‌పేట: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా కంభం ప్రాంతానికి చెందిన ఆరపాటి హరికృష్ణ బల్కంపేట రేణుకా బిల్డింగ్‌లో ఉంటూ ఎగ్ కుల్ఫీ వెండర్‌గా పని చేస్తున్నాడు. ఇదే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న జాబ నవీన్ ఎలక్ట్రీషియన్ పని చేస్తున్నాడు. వీరిద్దరు స్నేహితులు, సులువుగా డబ్బులు సంపాదించేందుకు గంజాయి వ్యాపారం చేయాలని నిర్ణయించిన వీరు తుని ప్రాంతానికి చెందిన అశోక్ వద్ద గంజాయి కొనుగోలు చేసి తీసుకువచ్చి నగరంలో తెలిసిన వారికి విక్రయిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం 3.5 కిలోల గంజాయి తెచ్చి చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం వారి ఇంట్లో సోదాలు నిర్వహించారు. వారి నుంచి 3.25 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారు ఇచ్చిన సమాచారం ఆధారంగా గంజాయి వినియోగిస్తున్న మరో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. 2 సెల్ ఫోన్లు, వేయింగ్ మిషన్ స్వాధీనం చేసుకున్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జయకృష్ణ

కేపీహెచ్‌బీకాలనీ: ప్రతి విద్యార్థికి సైబర్ సెక్యూరిటీపై అవగాహన ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంటర్ సాఫ్ట్ సొల్యూషన్స్ సెక్యూరిటీ కన్సల్టెంట్ జయకృష్ణ అన్నారు. జేఎన్‌టీయూహెచ్‌లో డైరెక్టరేట్ ఆఫ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో శుక్రవారం 'బ్లూ టీం సైబర్ సెక్యూరిటీ' అనే అంశంపై వర్క్‌షాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ వ్యవహారాల నిర్వహణలో యూనిక్ పాస్‌వర్డ్‌లను ఉపయోగించడం తప్పనిసరి అని అన్నారు. నకిలీ ఈ మెయిల్స్‌తో దృష్టిని ఆకర్షించే లింక్‌లను క్లిక్ చేయకుండా జాగ్రత్త వహించాలన్నారు. రద్దీ, బహిరంగ ప్రాంతాల్లో ఉచితంగా వస్తున్న వైఫై నెట్‌వర్క్‌లను ఉపయోగించకుండా ఉండటం మంచిదన్నారు. ఎప్పటికప్పుడు యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌లను పునరుద్ధరించుకోవాలన్నారు. కార్యక్రమానికి వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 62 మంది అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరగా రోడ్డు పనులు పూర్తి చేయాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, అధికారులు తదితరులు

ఆల్విన్‌కాలనీ: సీసీ రోడ్డు పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువు వద్ద ప్రధాన రహదారిలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డుకు ఇరువైపులా అంచుల వద్ద మట్టి పోయాలని సూచించారు. అదే విధంగా అసంపూర్తిగా ఉన్న రోడ్ల నిర్మాణ పనులను కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, షౌకత్‌అలీ మున్నా, రాజిరెడ్డి, పోశెట్టి గౌడ్, వాలి నాగేశ్వరరావు, ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

స్విమ్మింగ్, టెన్నిస్ జట్ల ఎంపిక



స్విమ్మింగ్ పోటీలో పాల్గొన్న మెన్ అండ్ ఉమెన్ క్రీడాకారులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లోని ఇండోర్ స్టేడియంలో స్విమ్మింగ్ పూల్‌లో మెన్ అండ్ ఉమెన్ ఆల్ ఇండియా సెలక్షన్ ట్రయల్స్‌ను శుక్రవారం నిర్వహించారు. అదే విధంగా టేబుల్ టెన్నిస్ జట్టును కూడా ఎంపిక చేశారు. ఈ పోటీల్లో ఎంపికైన స్విమ్మింగ్ క్రీడాకారులు డిసెంబర్ 21 నుంచి 23 వరకు ఎస్ఎస్ఆర్ఎం యూనివర్సిటీ చెన్నైలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు తమిళనాడులో డిసెంబర్ 10 నుంచి 14 వరకు జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ, యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్ఎస్ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ నల్లగొండ అశోక్ పాల్గొన్నారు.



టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

మద్యం మత్తులో పెదనాన్నపై యువకుడి దాడి

అడ్డగుట్ట: మద్యం మత్తులో సొంత పెదనాన్నపై ఓ యువకుడు బ్లేడ్‌తో దాడి చేసి గాయపరిచిన సంఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అడ్డగుట్ట, మొండిబండ నగర్‌కు చెందిన బుచ్చమ్మ కుమారులు మల్లికార్జున్, రాకేష్ రాణిగంజ్‌లోని హార్డ్‌వేర్ షాపులో పని చేస్తుంటారు. శుక్రవారం తమ ఇంటి వద్ద బంధువు రాజు దినకర్మ నేపథ్యంలో అందరూ మద్యం సేవించారు. మల్లికార్జున్ మద్యం మత్తులో కుటుంబ సభ్యులతో గొడవ పడుతుండటంతో అతడి పెదనాన్న శ్రీనివాస్ అతడిని అడ్డుకునేందుకు యత్నించాడు. దీంతో మల్లికార్జున్ పక్కనే ఉన్న బ్లేడ్‌తో శ్రీనివాస్‌పై దాడి చేయడంతో కడుపు, చేతిపై తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. దాడికి పాల్పడిన మల్లికార్జున్‌తో పాటు రాకేష్, బుచ్చమ్మలపై కేసు నమోదు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

హరిహర క్షేత్రంలో కుంకుమార్చన

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు కృష్ణ సూరి సమక్షంలో ఉదయం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చనలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



అలంకరణలో అమ్మవారు



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శుక్రవారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో వివిధ ప్రాంతాల సంక్షేమ సంఘాల ప్రతినిధులు కలిసి వివిధ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

వయో వృద్ధులకు అవగాహన సదస్సు



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వయో వృద్ధులు, నిర్వాహకులు

మోతీనగర్: మోతీనగర్ వెంచర్ త్రీ పార్కులో సీనియర్ సిటిజన్స్‌కు ఆరోగ్యం, ఆహారం, వృద్ధాప్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం సహృదయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మోతీనగర్, కల్యాణ్ నగర్ వెంచర్ త్రీ, రాజీవ్ నగర్, బీఎస్పీ కాలనీ, న్యూ రామారావునగర్, వి రామారావు నగర్ ప్రాంతాలకు చెందిన వయోవృద్ధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. వృద్ధులను చిన్న పిల్లల్లాగా కంటికి రెప్పలా సంరక్షించుకోవాలన్నారు. తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవాలని, క్రమం తప్పకుండా వ్యాయామం, నడక, యోగా, మెడిటేషన్ వంటి వాటిలో ఏదో ఒకటి అలవర్చుకోవాలన్నారు.

ముంపు సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



సమస్యను తెలుసుకుంటున్న మాజీ కార్పొరేటర్

మూసాపేట: ఇందిరానగర్‌లో సీసీ రోడ్డు పునరుద్ధరణ వల్ల కొన్ని ఇళ్లు రోడ్డు లెవెల్ కంటే దిగువకు చేరి వర్షాకాలంలో ముంపు సమస్య తలెత్తే అవకాశం ఉందని, ఆ సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ అన్నారు. కాలనీ ప్రజలు సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో శుక్రవారం కాలనీలో పర్యటించారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్డు నిర్మాణం చేపడతామని జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు హామీ ఇచ్చారు. కలుషిత నీటి సరఫరా నివారణకు ఇప్పటికే చర్యలు చేపట్టామని వాటర్ వర్క్స్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జిల్లా గోపాల్, ఏఈలు రంజిత్, వర్షిని, తుకారాం, రాజు, నర్సింహ, ప్రభాకర్, మంగమ్మ, బాలరాజు, యాదిలాల్, కృష్ణ, ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25న 'జర్నీ ఆఫ్ టీబీ అండ్ కొవిడ్.. లెసన్స్ ఫర్ ఫ్యూచర్ ఛాలెంజెస్'

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ఆడిటోరియంలో ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం ఉంటుంది. స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్ సహకారంతో సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు 'జర్నీ ఆఫ్ టీబీ అండ్ కొవిడ్.. లెసన్స్ ఫర్ ఫ్యూచర్ ఛాలెంజెస్' అనే అంశంపై ఈ ఉపన్యాస కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమానికి ప్రిన్సిపల్ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య స్వామినాథన్ ఉపన్యసిస్తారు.

ఎఫ్ఏబీఏ లైఫ్‌టైమ్ అవార్డు

ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్స్(ఎఫ్ఏబీఏ) ఆధ్వర్యంలో హెచ్‌సీయూలో డాక్టర్ సౌమ్య స్వామినాథన్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందిస్తారు. అంతర్జాతీయ స్థాయిలో ఆరోగ్య సంరక్షణ రంగంలో ఆమె చేసిన కృషికి ఈ అవార్డును అందించేందుకు ఏర్పాట్లు చేశారు. కొవిడ్ సందర్భంగా ఆమె కొవాక్సిన్ అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించారు.

బొటానికల్ గార్డెన్‌లో స్నేక్ షో



గచ్చిబౌలి: పాములు ప్రకృతి నేస్తాలని చిన్నారులకు అవగాహన కల్పించారు ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ సభ్యులు. శుక్రవారం నిర్వహించిన స్నేక్ షోలో నేల మీద, చెట్లపై, నీటిలో తిరిగే పాములు, వాటి స్వభావం గురించి వివరించారు. విషం ఉన్న, విషం లేని పాముల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పాములు ఎక్కడ నివాసం ఉంటాయి, అవి ఏమి తింటాయో చిన్నారులకు వివరించారు. ఆకుపచ్చ రంగులో చెట్లపై ఉండే పాములు, జెర్రిపోతు, నీరికట్టె, రెండు తలల పాములను చూపించారు. కాగా బొటానికల్ గార్డెన్ సందర్శించేందుకు వివిధ స్కూళ్లకు చెందిన విద్యార్థులు తరలి వచ్చారు.

నియోజకవర్గాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దుతా



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి అగ్రగామిగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని బొల్లారం ప్రధాన రహదారి నుండి బీకే ఎన్‌క్లేవ్, రెడ్డి కాలనీ, ప్రజాషెల్టర్ నుండి మక్తమహబూబ్‌పేట విలేజ్ వరకు లింక్ రోడ్డు రూ.85 లక్షల అంచనా వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, మెరుగైన రవాణా సౌకర్యం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. త్వరితగతిన సీసీ రోడ్డు పనులను పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించాలి



వైజ్ఞానిక ప్రదర్శనను పరిశీలిస్తున్న డీఈఓ విజయ కుమారి



సాంస్కృతిక నృత్య ప్రదర్శన

దుండిగల్: విద్యార్థులు నిరంతరం సృజనాత్మకంగా ఆలోచించి సమస్యల పరిష్కారాల కోసం అన్వేషించాలని డీఈఓ విజయ కుమారి అన్నారు. రాష్ట్రీయ బాల వైజ్ఞానిక, మేడ్చల్ జిల్లా స్థాయి వైజ్ఞానిక ఎగ్జిబిషన్‌ను దుండిగల్ మున్సిపాలిటీ గాగిల్లాపూర్‌లోని ఎస్ఎస్‌కెకె హైస్కూల్‌లో నిర్వహించారు. శుక్రవారం ముఖ్య అతిథిగా డీఈఓ హాజరై ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల నుంచి దాదాపు 280 సైన్స్ ప్రాజెక్టులు ఈ ఎగ్జిబిషన్‌లో భాగమయ్యాయి. చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలు, ఆటోమేటిక్ కెమెరా కంట్రోల్, రోడ్డు ప్రమాదాలు జరుగకుండా తీసుకునే నివారణ చర్యలు, అడ్వాన్స్ టెక్నాలజీ తదితర అంశాలపై విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు ఆకర్షించాయి. 24 మంది విద్యార్థులకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేయడంతో పాటు మొదటి 8 మందిని ఎంపిక చేసి సౌత్ ఇండియన్ సైన్స్ ఫెస్టివల్‌కు పంపనున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా జిల్లా స్థాయి నుంచి 17 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, జిల్లా సైన్స్ అధికారి కె. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి రవీందర్ రాజు, ఎంఈఓ కృష్ణ, కుత్బుల్లాపూర్ ఎంఎల్ఓ రమేష్, ఎస్ఎస్‌కెకె స్కూల్ సెక్రటరీ బాబు, ప్రిన్సిపాల్ సుమాదేవి, వివిధ మండలాల విద్యాధికారులు, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

24న విశ్వనాథ సాహిత్య పీఠం ద్విదశాబ్ది ఉత్సవాలు

సనత్‌నగర్: విశ్వనాథ సాహిత్య పీఠం ద్విదశాబ్ది ఉత్సవాలను ఈ నెల 24న బేగంపేటలోని సెస్ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్, పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆవుల మంజులత, ఆలిండియా రేడియో రిటైర్డ్ ప్రోగ్రాం హెడ్ సుమనస్పతిరెడ్డి పాల్గొననున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి విశ్వనాథ సత్యనారాయణ రచనల్లో 'హాస్య రసం' పై జరిగే సదస్సులో కేంద్ర సాహిత్య అకాడమీ (సలహా బోర్డు) కన్వీనర్ ఆచార్య మృణాళినితో పాటు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రమణ్యం, విశ్వనాథ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ కొండల్‌రావు వెల్చాలతో పాటు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెలదండ నిత్యానందరావు, తనికెళ్ల భరణి, ఓలేటీ పార్వతీశం తదితరులు పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి చేతుల మీదుగా 'పూర్ణత్వపు పొలిమేరలో..'(సంక్షిప్తం) ఆవిష్కరణ, చేవూరు సుబ్బారావుచే 'సమ్మాన్యుడు' (సంక్షిప్త) ఆవిష్కరణ, ప్రసంగాలు ఉంటాయి. సాయంత్రం 5 గంటలకు రిటైర్డ్ ఐఏఎస్ కేవీ రమణాచారి అధ్యక్షతన 'తెలంగాణతో విశ్వనాథ అనుబంధం' పై జరిగే సదస్సులో మంత్రి జూపల్లి కృష్ణారావు, విశ్వనాథ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ కొండలరావు పాల్గొంటారు.

ర్యాగింగ్ చేస్తే క్రిమినల్ కేసులు

చింతల్: ర్యాగింగ్‌తో తోటి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన శిక్షలు ఉంటాయని బాలానగర్ ఏసీపీ హనుమంతరావు హెచ్చరించారు. శుక్రవారం ఐడీపీఎల్‌లోని భాగ్యరథి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ర్యాగింగ్‌లో పాల్గొనే అందరిపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. మంచి విలువలను అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ర్యాగింగ్‌కు దూరంగా ఉంటామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు నాయుడు, హరీష్, సత్యనారాయణ పాల్గొన్నారు.